ప్రజాశక్తి
www.prajasakti.com
మంగళవారం 30 మే 2023
5
వైఎస్ఆర్

నేడు సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం

కడప అర్బన్ : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్ పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1970, మే 30నతేదీ కలకత్తా నగరంలో సిఐటియు ఆవిర్భవించిందన్నారు. 53 సంవత్సరాలుగా కార్మికుల సమస్యల మీద రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిజాయితీగా నిక్కిసిగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు, పబ్లిక్ సెక్టార్ అమ్మేయడం, కార్మిక హక్కులు కాలరాయడం చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటి వరకు కార్మికుల పక్షాన దాదాపు 26 సమ్మెలు నిర్వహించిందని తెలిపారు. మంగళవారం ఉదయం జెండా ఆవిష్కరణ, ర్యాలీలు, సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆప్కోకు పూర్వ వైభవం తథ్యం

- జూన్ నుంచి 75 శాతం డిస్కౌంట్
- 100 శాతం సరుకు కొనుగోలుకు ఆదేశాలు
- సొసైటీ కార్మికుల మృతికి పరిహారం చెల్లిస్తాం
- విలేకరుల సమావేశంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆప్కో పూర్వవైభవాన్ని సంతరించుకోవడం తథ్యమని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పేర్కొన్నారు. సోమవారం ఆయన కడప, అన్నమయ్య జిల్లాల ఎడిలు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలు ఆర్థికాభివృద్ధిని సంతరించుకునేలా, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చూశా మన్నారు. ఫలితంగా ఆప్కో కార్మికుల ఉపాధి, అవకాశాలను మెరుగు పరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 2022 డిసెంబర్ నాటికి పాత బకాయిలన్నింటినీ క్లియర్ చేశామన్నారు. సొసైటీల నిల్వలన్నింటినీ వంద శాతం కొనుగోలు చేశామని తెలిపారు. మొదటి విడత కింద రూ.48 లక్షల స్టాకును తీసుకున్నామన్నారు. కోర్టు తీర్పు వచ్చిన నేపథ్యంలో బకాయిలను చెల్లించామని తెలిపారు. ప్రస్తుతం ఆప్కో దగ్గర రూ.50 లక్షల విలువ కలిగిన సరుకు నిల్వ ఉందన్నారు. 2013 నుంచి 2017 సంవత్సరాలకు చెందిన సరుకు అధిక శాతం డిస్కౌంట్ పెట్టామని చెప్పారు. జూన్ నుంచి 75 శాతం డిస్కౌంట్ అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇన్‌స్టాల్‌మెంట్ ఉంటుందన్నారు. బయటి వ్యక్తులు సరైన పత్రాలను సమర్పిస్తే 12 నెలలపాటు డిస్కౌంట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. స్టాకును వేగంగా విక్రయించడం, టర్నోవర్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సొసైటీ కార్మికులు అనారోగ్య కారణాలతో మృతి చెందితే రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు పరిహారం చెల్లించే పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలో 100 మందికి చెక్కులు అందించనున్నట్లు తెలిపారు. రాయలసీమలో త్వరలో అందించనున్నామని చెప్పారు. రూ.2.5 కోట్ల ఎన్‌హెచ్‌డిసి బకాయిలు చెల్లించామన్నారు. తొమ్మిదేళ్లుగా చేనేత కార్మికుల వేతనాలు పెంచలేదని, ప్రస్తుత పరిస్థితుల్లో జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో చేనేత విక్రయ శాలలను ప్రభుత్వ భవనాల్లోకి మార్పుచేస్తున్నామని తెలిపారు. ఆప్కో ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంగళగిరిలోని 3.5 ఎకరాల చేనేత స్థల ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. చేనేత రంగానికి విశిష్ట కృషి చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జులై నుంచి సేల్స్‌మెన్ వేతనాలను పెరుగుతాయని చెప్పారు. నేత న్ననేస్తం కింద అందించే రూ.24 వేలతోరా మెటీరియల్ కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య ఎడిలు భీమయ్య, శ్రీనివాసరెడ్డి, ఎడిఓలు శేషగిరి, రవి, అహ్మద్, కిరణ్‌కుమారి, వనిత, డిఓలు కృష్ణ, ఆప్కో డైరెక్టర్ ఉదయగిరి వెంకటేష్, సొసైటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి

'ఉపాధి' కూలి రేట్లు పెంచాలి

- వ్య.కా.స. ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధి హామీ చట్టం కింద కింద పని చేస్తున్న కూలీలకు కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్ అన్వేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. మహవీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు వేసవి అలవెన్సులు కొనసాగించాలని, 40 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా పని కల్పించాలని కోరారు. గ్రామాలతో పాటు, పట్టణాల్లోను ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. పనిముట్లకు సానపట్టుకోవడానికి ఇస్తున్న అలవెన్సులు అమలు చేయాలన్నారు. నీళ్లు, మజ్జిగకు అలవెన్సులు కొనసాగించాలని చెప్పారు. ఆన్‌లైన్ మస్టర్ రద్దుచేసి పనులకు డబ్బులు చెల్లించాలని చెప్పారు. పనిచేసిన పనులకు కూలి చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి పనిముట్లు ఇవ్వాలన్నారు. మెట్లను తిరిగి కొనసాగించి, పారితోషకం పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి అలవెన్సులు ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని వాపోయారు. దీని వల్ల కూలీలు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ మాట్లాడుతూ ఉపాధి పనుల మెరుగుదల కోసం రైతులు, రైతు కూలీలు కలిసి దశలవారి పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు.

ధర్నాలో ఉపాధి కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కనీస కూలి రూ.500 పదేలా చూడాలని డిమాండ్ చేశారు. పని చేసేచోట మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. కోటేశ్వర్లు వంద ఎకరాలు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుంటే పోలీస్, రెవెన్యూ అధికారులు వారి జోలికి వెళ్లడం లేదని పేర్కొన్నారు. పేదలు భూ పోరాటం చేస్తే అడ్డుకుంటున్నారని విమర్శించారు. బద్వేల్‌లో ఫోర్జరీ డాక్యుమెంట్స్ సృష్టించి స్థలాలు ఆక్రమిస్తుంటే కేసు మాఫీ చేశారని తెలిపారు. దీనికి వెనుక వైసిపి నాయకులు ఉండడమే అన్నారు. మోడీ, జగన్ ఉన్నవారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వ్య.కా.స జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరయ్య, గురవయ్య, పోలయ్య, నారాయణ, రాయప్ప, ఖాదర్‌బాష, రమణమ్మ, ఖదిరున్నిసా, ఆకా చంద్రశేఖర్, కూలీలు పాల్గొన్నారు.

పౌర సంబంధాల శాఖ ఎడి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో జెసికి వినతి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో, జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) జిల్లా అధ్యక్షులు విఎన్ చంద్రమోహన్ రాజు, నాయకులు కాటిబోయిన నారాయణ, నూర్‌బాషా డిమాండ్ చేశారు. జర్నలిస్టుల డిమాండ్స్‌డేను పురస్కరించుకొని జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు హై పవర్ కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. పెన్షన్, కార్మిక బీమా వర్తింపజేయాలని, మీడియా కమిషన్‌తో పాటు జర్నలిస్టుల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చి ఆరోగ్య బీమా అమలుపై సమీక్షకు కమిటీని వేయాలన్నారు. కొత్తగా ఇచ్చిన జీవో వల్ల చిన్న, మధ్య, పెద్ద పత్రికలకు అక్రిడిటేషన్ల మంజూరులో కోత పడుతోందన్నారు. తక్షణం ప్రభుత్వం కొత్త జీవోలో సవరణ చేసి పెద్ద సంఖ్యలో అక్రిడిటేషన్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం సమాచార శాఖ ఏడి వేణుగోపాల్ రెడ్డికి, గ్రీవెన్స్ సెల్‌లో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. జెసి గణేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు ఎం. సిద్దయ్య, టేకూరు సుదర్శన్, జంబారపు రవికుమార్, వర కుమార్, కరిముల్లా, గౌస్, సుబ్బరాయుడు, భాస్కర్ రెడ్డి, మౌలాలి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

కడప : వృత్తి, ఉద్యోగ, వ్యాపార నిర్వహణలో సానుకూల దృక్పథంతో విధులను బాధ్యతతో నిర్వర్తించాలని 108 ఈఎంఆర్ఐ సేవా సంస్థ మొట్టమొదటి సిఇఒ చంగవల్లి వెంకట్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సభా భవన్ లో కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'లక్ష్య సాధనకు.. విధి నిర్వహణలో అనుసరించాల్సిన మెలకువలు' అనే అంశంపై అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే ప్రతి పని పట్ల నిబద్ధత ఉండాలన్నారు. వినూత్న ఆలోచనతో ముందుకెళ్లాలని సూచించారు. లక్ష్య కాంక్షతో విధులు నిర్వహిస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ, మండల స్థాయి, ప్రత్యేకధికారులు పాల్గొన్నారు.

గృహ లక్ష్యాన్ని అధిగమించాలి

కడప : జిల్లాలో నిర్ణీత లక్ష్యం మేరకు జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతిపె నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టం మాట్లాడుతూ మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్‌డిఒలు ధర్మ చంద్రారెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖలకు చెందిన నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలి

కడప : స్వీకరించిన అర్జీలకు వేగవంతంగా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిపిఒవెంకట రావు, హౌసింగ్ పీడి కృష్ణయ్య, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ .వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ వీరన్న, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, సమగ్ర శిక్ష ఏపిసి ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

కడప : ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన మామిడి, అరటి, బొప్పాయి రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఇటీవల ఈదురు గాలులకు నష్టపోయిన పంటలను హార్టికల్చర్ అధికారులతో కలిసి, పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసి రెడ్డి, ఎఐసిసి మెంబర్ బండి జకరయ్య, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. సత్తారు, జిల్లా నాయకులు నరసింహారెడ్డి, రత్నం, అమర్నాథ్ రెడ్డి రాజంపేట, సిద్ధవటం, మందపల్లె రైతులకు చెందిన మామిడి, అరటి, బొప్పాయి పంటలు ను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపో యిన రైతుకు ఎకరాకు రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న నాయకులు

నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

రంగసముద్రం పంచాయతీలోని సర్వే నంబర్ 1263లో నిజమైన లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎదుట జిబి నగర్ కాలనీ వాసులు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1263 సర్వే నంబర్‌లో 54.52 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో 15 ఏళ్లుగా పేదలు పూరిగుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు మిలటరీ కమిటీ పేరు చెప్పుకుని గుడిసెలను, బేస్‌మట్టాలను దౌర్జన్యంగా తొలగిస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి మిలటరీ వారికి ఇచ్చిన స్థలాన్ని సర్వే చేసి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు షేక్ గౌసియాబేగం, కెవిపిఎస్ నాయకులు సుందరయ్య, కుసులూరు రవి, కంఠ.శ్రీను బీబీ, లూర్ధుమేరీ బాలగురయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చెన్నూరు : మండలంలోని చిన్నమాసుపల్లెకు చెందిన యాకోబు (35) రోడ్డు ప్రమాదంలో ఇటీవల చనిపోయాడు. ఈ విషయాన్ని చిన్న మాసుపల్లె వైసిపి నాయకులు జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్ర ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి రవీంద్రనాథరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చిన్న మాసుపల్లె వైసిపి నాయకులు బుజ్జి రెడ్డి, శ్రీను, చంటి, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

పోరుమామిళ్ల టౌన్ : ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో ప్రజలకు అనేక రకాల వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తలారి శ్రీవిద్య అన్నారు. మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయతీలోని రెండవ సచివాలయం పరిధిలో గుర్రప్పగారిపల్లెలో 104 వైద్యాధికారి శ్రీ విద్య ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలకు, చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు.

న్యాయమూర్తి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప

మొదటి అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తూ న్యాయవ్యవస్థకు సి.ఎన్. మూర్తి అందించిన సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస్ ఆంజనేయ మూర్తి అన్నారు. సి. ఎన్. మూర్తి ఉద్యోగోన్నతి పొంది బదిలీపై విశాఖపట్నంలోని సిబిఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జిగా వెళుతున్న సందర్భంగా సోమవారం సాయంత్రం కడప బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి. వి. రాఘవరెడ్డి అధ్యక్షతన జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ హాలులో వీడ్కోలు, సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జడ్జిగా సి. ఎన్. మూర్తి కడప జిల్లా కోర్టులో వివిధ హోదాల్లో మంచి సేవలు అందించారని కొనియాడారు. . కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ అందరి మన్ననలు పొందిన జడ్జిగా సి. ఎన్. మూర్తికి మంచి పేరు ఉందన్నారు. విశాఖపట్నం సిబిఐ కోర్టుకు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జిగా వెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు అనంతరం మూర్తిని కడప బార్ అసోసియేషన్ తరపున సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహ్మద్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి గీత, సబ్ జడ్జి ఎస్. కవిత, అడిషనల్ జడ్జి ప్రదీప్ కుమార్, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ ప్రవంతి, రెండవ అదనపు జిల్లా జడ్జి భార్గవి, కడప బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సి.ఎస్. మూర్తిని సన్మానిస్తున్న 'బార్' నాయకులు

స్పందన ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

కడప అర్బన్ : పోలీస్‌శాఖకు స్పందన ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌పి అన్బు రాజన్ అధికారులను ఆదేశి ంచారు. స్పందన ఫిర్యాదులకు అధిక ప్రధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు.

జగన్‌ను చీకటిలో నడిపిస్తున్నారు

కడప అర్బన్ : జగన్ ను చీకటిలో సలహాదారులు నడిపిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. సోమవారం ఉపాధ్యాయ భవనంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.చంద్రా రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాసే చర్యలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైసిపి పాలకపక్షం ప్రశ్నించకపోవడం దురదష్టకరమన్నారు. అనుభవం లేని ఎన్టీఆర్ కేంద్రంపై సమరం సాగించారని, అనుభవం ఉన్న చంద్రబాబు వణికి పోతున్నారని ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రి జిల్లా వాసి అయినప్పటికీ, జిల్లా సమగ్ర అభివద్ధికి నిధులు ఇవ్వలేదని, అభివద్ధి శూన్యమని ఆరోపించారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాను మహానగరంగా తీర్చితానని చెప్పటం హాస్యాస్పందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, ఫరూక్ హుస్సేన్, జమీల, శంషాద్, ఎమ్మార్ నాయక్, సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ప్రావిజినల్ కో-ఆర్డినేటర్‌గా నాగేళ్ల వెంకట సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కడప

ఎపి ఎన్ఆర్‌టి ఎస్ ప్రావిజినల్ కో-ఆర్డినేటర్‌గా నాగేళ్ల వెంకటసుబ్బారెడ్డిని నియమిస్తూ సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని డైరెక్టర్ పి.హెచ్. ఇలియాస్, వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, కువైట్ రీజినల్ కో-ఆర్డినేటర్ మహేష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కువైట్ లోని కైతాన్ ప్రాంతంలో వైఎస్ఆర్ అన్నమయ్య జిల్లాకు చెందిన వారు వేలల్లో నివాసం ఉంటున్నారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కువైట్ ప్రభుత్వం అకామా లేని వారిని ఎలాంటి కేసులు లేకుండా స్వదేశానికి వెళ్లవచ్చని చెప్పడంతో ఆ సమయంలో చాలా మంది మహిళలకు ఉండేందుకు ఉచితంగా రూములు ఇచ్చి భోజన సదుపాయాలు కల్పించి తెలుగు ప్రజలను నాగేళ్ల వెంకట సుబ్బారెడ్డి ఆదుకున్నారని తెలిపారు. నాగేళ్ల వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ తన బాధ్యతలను భవిష్యత్తులో సక్రమంగా నిర్వహించి అందరిని కలుపుకుని పోయి తెలుగు ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కో- కన్వీనర్ గోవిందు నాగరాజు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు మన్నూర్ చంద్రశేఖర్ రెడ్డి, సలహాదారుడు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జి పి . సురేష్ రెడ్డి, మైనారిటీ వైస్ షేక్ రహమతుల్లా , ఆడపూర్ ప్రసాద్, షరీఫ్, ఆరవ సుబ్బారెడ్డి, గజ్జల నరసారెడ్డి , భాస్కర్ రెడ్డి, పల్లె సుబ్బారెడ్డి, నూర్ బాషా, బాలయ్య, రెడ్డయ్య పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న వెంకటసుబ్బారెడ్డి

చంద్రబాబు మాయమాటలు ప్రజలు నమ్మరు

ప్రజాశక్తి - కడప

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు సాక్షిగా ప్రతిపక్ష నేత చంద్రబాబు మభ్య పెట్టేలా మాయ మాటలు మాట్లాడారని, ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరిచిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన కిలో రెండు రూపాయలు బియ్యం పథకాన్ని, మద్యపాన నిషేధాన్ని ఎత్తేసారని విమర్శించారు. రుణమాఫీ చేస్తామని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ అన్ని వర్గాల ప్రజల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి న్యాయం చేయలేదన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజలు వాటిని నమ్మేందుకు సిద్ధంగా లేరని, ఎన్నికల్లో వైసిపిని మెజార్టీతో గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజాశ్రేయస్సే టిడిపి లక్ష్యం

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజాశ్రేయస్సే కోరుకుంటుందని తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షులు చవలముడి మౌనిక అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో మహిళలు, నిరుద్యోగులు, అమ్మాయిలు, రైతులు, బిసిలకు ఎంతో మేలు చేసేదిలా ఉందన్నారు. వైసిపిని మహిళలే గద్దె దింపుతారని తెలిపారు. సైకో పోయి సైకిల్ పాలన రావాలన్నారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు జయశ్రీ, తెలుగు మహిళ నాయకులు గాయత్రి, వసుందర, ఝాన్సీ, పద్మిని, మేరీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మౌనిక

ప్రయివేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలకు వినతి

కడప అర్బన్ : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లు నడుస్తున్నాయని, అటువంటి వాటి పై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరనాల.శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో డిఆర్ఒకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో, కడప నగరంలో ప్రయివేటు డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబం ధనలకు విరుద్ధంగా నడుస్తూ ప్రజల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా డయాగ్నస్టిక్ సెంటర్లలో ఏ టెస్టుకు, ఏ స్కానింగ్‌కు ఎంతనో ధరల పట్టిక లేదన్నారు. కొన్ని సెంటర్లు అయితే డబ్బులు తీసుకుని రశీదులు కూడా ఎవ్వడం లేదు అన్నారు. అనంతరం డిఆర్ఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రమాదకర విద్యుత్ తీగలు తొలగించాలి

కడప అర్బన్ : మరాఠి వీధిలో ప్రజల ప్రాణాలను విద్యుత్ తీగలు కబలిస్తున్నాయని, వెంటనే తొలగించాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. సోమవారం మరాఠి వీధిలో డివైఎఫ్ఐ నాయలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లకుపైగా 48వ డివిజన్ పరిధిలో ఉన్న మరాఠి వీధి వంశి సూపర్ మార్కెట్ నుంచి మెయిన్ రోడ్డు రాజా అంగడి వరకు, అక్కడి నుంచి చౌడమ్మ గుడి వరకు ప్రధాన రహదారి మధ్యలో విద్యుత్ తీగలు చెయ్యి ఎత్తితే అందే అంత ఎత్తులో వేలాడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే కార్పొరేషన్ యంత్రాంగం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అహమ్మద్, నవీన్, జావిద్ పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

కడప అర్బన్ : రాయచోటి పట్టణం బషీర్‌ఖాన్ పెట్రోల్ బంకులో ట్యాంక్ క్లీన్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ. కోటి పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంఘటనపై పెట్రోల్ బంక్ యజమానిని తక్షణమే అరెస్టు చేయాలని తెలిపారు. హిందుస్తాన్ పెట్రోలియం లిమిటెడ్ యాజమాన్యం, పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్లక్ష్య వల్లే కార్మికులు మృతి చెందారని పేర్కొన్నారు. రక్షణ సౌకర్యాలు కల్పించడంలో పెక్రటోల్ బంక్ యజమాని విఫలమయ్యారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చేటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

కడప అర్బన్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సర్ సి.వి.రామన్ కడప డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, సైన్స్ క్లబ్ కార్యదర్శి వై.శ్రీధరరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో 'సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిలో ఇమిడి ఉన్న సూత్రాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రకృతి పరమైన సహ సంబంధానికి పరస్పర ఆధారానికి అంతరాయం కలగకుండా ఉండాలని పేర్కొన్నారు.

ప్రథమ చికిత్స అందించాలి

కడప అర్బన్ : జిల్లాలో ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పేర్లకు ముందు డాక్టర్ అని రాయకూడదని తెలిపారు. బోర్డులో క్లినిక్, ఆసుపత్రి అని రాయకూడదని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే రాయాలని తెలిపారు. బెడ్స్ ఉండకూడదని, అడ్మిషన్స్ చేసుకోకూడదని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - ముద్దనూరు

బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎంపిపి

మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అన్నారు. మండల వైసిపి యూత్ అధ్వర్యంలో జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ సమీపంలో ఉన్న మైదానంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముద్దనూరు హైస్కూల్ లెవెన్ జట్టు, ఎర్రగుంట్ల సన్నా లెవెన్ జట్టు ఆడారు. వీరిలో ముద్దనూరుకు చెందిన హైస్కూల్ లెవెన్ జట్టు విజేతగా నిలిచి రూ.50,116 మొదటి బహుమతి సొంతం చేసుకుంది. ఎర్రగుంట్లకు చెందిన సన్నా జట్టు రన్నరపుగా నిలిచి రూ.30,116 రెండవ బహుమతి గెలుచుకుంది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మునిరాజా రెడ్డి ఆ జట్ల కెప్టెన్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ అధ్యక్షుడు సుమంత్ యాదవ్, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గురప్ప, సర్పంచు సరళ, ఉప సర్పంచు వీరాంజనేయరెడ్డి, ఎంపిటిసి ఇంద్రాణి, నాయకులు పుల్లయ్య యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు కళాశాల బిటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో 2023 సంవత్సరం ఏప్రిల్ నెలలో నిర్వహించిన బిటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్ (ఆర్19), బిటెక్ మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్(ఆర్20), బిటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ సప్లిమెంటరీ (ఆర్15, ఆర్19)పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వసుంధర తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ బిటెక్ మూడవ సంవత్సరం రెగ్యులర్ పరీక్షల్లో విద్యార్థులు 357 మంది నమోదు చేసుకోగా, 320 మంది ఉత్తీర్ణులయ్యారు. బిటెక్ నాలుగవ సంవత్సరం రెగ్యులర్ పరీక్షలలో విద్యార్థులు 352 మంది నమోదు చేసుకోగా, 327 మంది ఉత్తీర్ణులయ్యారు అని తెలిపారు. తక్కువ సమయంలోనే ఫలితాలను విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అభినందించారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను పలు శాఖల అధిపతులు అభినందించారు.

డ్రాయింగ్, పుస్తక పఠనంపై శిక్షణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల గ్రంధాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, డ్రాయింగ్ తరగతులు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు సిద్దయ్య సత్య హరిశ్చంద్రుడు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణకిషోర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'గండి' హుండీల ఆదాయం రూ.15 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట(వేంపల్లె)

చక్రాయపేట మండలంలోని శ్రీవీరాంజనేయస్వామి గండి క్షేత్రంలో ఉన్న హుండీల ద్వారా రూ.15,51,153 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. సోమవారం గండి క్షేత్రంలోని హుండీలను దేవదాయశాఖ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండి క్షేత్రంలో ఉన్న దేవుని హుండీలను 60 రోజులకు గాను లెక్కించగా ఆలయంలో ఉన్న హుండీలో రూ.15,36470 లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.14,683 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. బంగారు 6గ్రాములు, వెండి 300 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిజిబి మేనేజర్ అశోక్, ఆర్‌కె వ్యాలీ పోలీసు సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి పథకాలకు పేరుమార్చి టిడిపి మేనిఫెస్టో

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు పేరు మార్చి వాటినే కొనసాగిస్తామని టిడిపి తన మేనిఫెస్టో ప్రకటించిందని వైసిపి మండల నాయకులు మాధవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ దుబారా చేస్తున్నారని, పథకాల ద్వారా ప్రజలకు డబ్బులు పంచి పెడుతున్నారని పేదవారికి డబ్బులు ఎందుకివ్వాలి అని నిన్నటి వరకు విమర్శించిన నాయకులు నేడు అవే పథకాలను తాము అధికారంలోకి వస్తే కొనసాగిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్‌ను మరో శ్రీలంకగా పోల్చిన మాజీ ముఖ్యమంత్రి ఈ రోజు అవే పథకాలను అమలు చేస్తామని మహానాడులో తీర్మానించడం ఏంటని ఆయన ప్రశ్నించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారానికి చెందిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పౌర మానవ హక్కుల సంస్థ జిల్లా జాయింట్ సెక్రటరీ గూడూరు రామచంద్ర కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శివలక్ష్మికి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్ర అధికార యంత్రాంగంలో అవినీతిని నిర్మూలించేందుకు సమాచార చట్టాన్ని 2005లో భారత ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సమాచార చట్టం అమలు చేసి 16 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాల్లో అవినీతి నిర్మూలన కాలేదన్నారు. రెవెన్యూ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు సూచిక బోర్డుల్లో పెట్టాలని కోరారు.

నాడు-నేడు పనుల్లో అవకతవకలపై విచారణ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులలో అవకతవకలపై ఫిర్యాదు రావడంతో సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. నాడు-నేడు ఫేస్ టు కింద రూ.16 లక్షల రూపాయలతో పాఠశాల అభివృద్ధికి నిధులు వచ్చాయి. ప్రధానోపాధ్యాయుడు రూ.3లక్షల 78 వేలకు పైగా డబ్బు ఖర్చు చేసినట్టుగా రికార్డ్స్‌లో ఉంది.. కానీ అంత డబ్బు ఖర్చుతో పాఠశాల అభివృద్ధి జరగలేదని గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సర్వశిక్ష అభియాన్ డిఇ సుధాకర్ రెడ్డి, అడిషనల్ ఎపిఒ రజనీకాంత్‌రెడ్డి విచారించారు. పాఠశాల చైర్మన్, గ్రామస్తులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. కమిటీ నెంబర్ల సంతకాలు లేకుండా డబ్బులు డ్రా చేసినట్లుగా అధికారులకు తెలిపారు. విచారణలో అధికారులకు బిల్లులు, చెక్ బుక్కులు చూపించలేదు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఒ పుల్లయ్య, నాడు-నేడు పనుల పర్యవేక్షణ ఎఇ ప్రసాద్, సచివాలయ ఇంజనీరు ఆరిఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

జమ్మలమడుగు రూరల్ : చేతి వృత్తిదారులను జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ వీరనాల శివనారాయణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారి ఇక్బాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో చేతి వృత్తిదారులు కుదేలవుతున్నారన్నారు. నవరత్నాల పేరుతో వృత్తిదారులకు అన్యాయం జరుగుతోందన్నారు. చేతి వృత్తిదారులను విస్మరించిన ప్రభుత్వానికి రానున్న రోజుల్లో అందరినీ ఐక్యపరిచి పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు మునికుమార్, సంజీవరాయుడు, శ్రీను, పల్లా లక్ష్మి నారాయణ, రమణ, గొరిగే కృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

ఎర్రగుంట్ల : యువగళం పాదయాత్ర సందర్భంగా మంగళవారం సాయంత్రం జమ్మలమడుగులో నిర్వహించే లోకేష్ బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పక హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల జయరామిరెడ్డి, మండలశాఖ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, బయపరెడ్డి, దాసరి రాజారెడ్డి, సేర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణం ఎప్పుడో..!

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు వద్ద బస్టాండు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశంలో నిలిపిన ఆటోలు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మండల కేంద్రమైన చాపాడు, అల్లాడుపల్లె, బద్రిపల్లె గ్రామాల వద్ద బస్టాండ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. బస్టాండ్లులేక ప్రస్తుతం ప్రయాణికులు నానా అవస్థలు పడు తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు రోడ్లపైన నిలవాల్సి ఉంది. ఎండ, వానకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీపేట రోడ్డు వద్ద గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాం తాల్లో ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన గ్రామాల వద్ద బస్టాండ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత వర్షాకాలంలో కూడా ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అవ సరమైనచోట బస్టాండ్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు 'యువగళం' భారీ బహిరంగ సభ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా జమ్మలమడుగులో మంగళవారం సాయంత్రం తాడిపత్రి రోడ్డులోని మయూర లాడ్జి వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో అభివృద్ధి నాలుగేళ్ల నుంచి కుంటుపడిన విషయంపై యువగళం పాదయాత్రలో భాగంగా జరిగే భారీ బహిరంగ సభలో నారా లోకేష్ గళం విప్పేనా అని ప్రజలు చర్చిం చుకుంటున్నారు. వైసిపి ప్రభుత్వంలో సచి వాలయాలు, ఆర్‌బికెల నిర్మాణాలు తప్ప ఏవిధమైన అభివృద్ధి జరగలేదు. స్థానిక ఎమ్మెల్యే పెన్నా, చిత్రావతి నదిలోని ఇసుక తదితర వాటిని ఆదాయ వనరులుగా మార్చుకున్నారనే ఆరోప ణలు ఉన్నాయి. మరి ప్రజలకు ఆదాయ వనరులు ఎక్కడని యువగళంలో లోకేష్ గట్టిగా ప్రశ్నిస్తాడా అని చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీలు జమ్మలమడుగు ప్రజలకు ఇచ్చారు. పులివెందుల, జమ్మలమడుగు తనకు రెండు కళ్ళు లాంటివని చెప్పి, నేడు పులివెందులకు కేటాయించిన నిధుల్లో కనీసం పావలా భాగమైనా ఇవ్వలేదనే ఆరోపణలున్నాయి. గండికోట ముంపు వాసులకు హామీ ఇచ్చిన రూ.3.25 లక్షలు ఇప్పటికీ నెరవేరలేదు.. శనగపంటకు రూ.6,500 మద్దతు ధర ప్రకటించకపోవడం.. రాజోలి ఆనకట్ట కింద వెళ్లే ముంపువాసుల రైతుల, బడుగు, బలహీన వర్గాలకు చెందిన జీవన విధానంపై, స్టీల్ ప్లాంట్ మోసపూరిత అంశాలపై చర్చించాల్సిన విషయం ఎంతైనా ఉందని ప్రజలు భావిస్తున్నారు. అలాగే 36 ఏళ్ల టిడిపిని అంటి పెట్టుకొని ఉన్న పొన్నపురెడ్డి కుటుంబం, నిన్న ఎన్నికలలో మాజీమంత్రి రామసుబ్బారెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టిడిపి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యే చేతిలో 52 వేల ఓట్లతో తేడాతో ఓడిపోయారు. మళ్లీ సుధీర్‌రెడ్డి వద్దకే వెళ్లడం.. ఇదే సమయంలో టిడిపి నుంచి ఆది నారాయణరెడ్డి కూడా బీజేపీలోకి పోవడంతో జమ్మలమడుగులో టిడిపికి పట్టులేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తనయుడు భూపేష్‌రెడ్డి టిడిపి పగ్గాలు చేపట్టారు. పాత టిడిపి నేతలను, కార్యకర్తలను, అభిమానులను తన కుటుంబ అభిమానులను కలుపుకొని నేడు జమ్మలమడుగులో పూర్వ వైభవం తేవడంలో ఆయన కృషిని యువగళం బహిరంగ సభలో లోకేష్ బాబు ప్రస్తావిస్తాడా అని ప్రజల్లో చర్చి సాగుతోంది. టిడిపి, బిజెపి ఏకమైతే జమ్మలమడుగులో టిడిపి ఎమ్మెల్యే టికెట్ విషయంలో భూపేష్‌రెడ్డికే లోకేష్ సభ వేదిక ద్వారా ప్రకటిస్తారా అని ప్రజల్లో ఉంది. ఇంత పెద్ద పార్టీని జమ్మలమడుగులో వైసిపికి ఎదురెల్లి భూపేష్‌రెడ్డి ముందుకు తీసుకుపోతున్నాడంటే ఆషామాషీ కాదనే విషయం లోకేష్ గ్రహించి, భూపేష్‌రెడ్డికి పూర్తిగా మద్దతు తెలపాలని, పార్టీలోకి ఎంత మంది వచ్చినా, ఎన్నిపార్టీలు కలిసినా జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి అని తెలిపితే యువగళం యాత్ర ద్వారా ఇక్కడి ప్రజలు, టిడిపి కార్యకర్తల్లో మరింత ఉత్తేజం నింపిన వారవుతారు. టిడిపి గెలుపునకు కారణం అవుతాడని ప్రజలలో చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా సభలో లోకేష్ కేవలం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై, స్థానిక సమస్యలపై, జగన్ హామీలను ప్రస్తావించి వెళతాడా లేక భూపేష్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిపై క్లారిటీ ఇచ్చి వెళతాడా అనేది నియోజక వర్గంలోని ప్రజలతోపాటు జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

టిడిపి మేనిఫెస్టోకు నిరసనగా వైసిపి ర్యాలీ

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - దువ్వూరు

తెలుగుదేశం పార్టీకి భవిష్యత్ లేదని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. 2014లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా రాజమండ్రిలో జరిగిన మహానాడులో ఆయన ప్రజలకు ఇస్తున్న హామీలను చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. 2014లో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం వైసిపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత దువ్వూరు ఆంజనేయస్వామి గుడి నుంచి గుడిపాడు, చింతకుంట, మైదుకూరు మీదుగా ఖాజీపేట వరకు మూడు వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉంటే చంద్రబాబుకు ప్రజల్లో నమ్మకం ఉండేదన్నారు. కేవలం పదవి కోసమే చంద్రబాబు ఉన్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఎన్ని పొత్తులు పెట్టుకున్నా మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపినే అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ అప్పట్లో చంద్రబాబు రైతులకు బంగారు రుణాలు, రైతుల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. మోసపూరితమైన చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేదరన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షుడు నారా చంద్రబాబు మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. టిడిపి రాజమహేంద్రవరంలో ఆదివారం ప్రకటించిన మొదటి మేనిఫెస్టోపై ఎమ్మెల్యే సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందించారు. చంద్రబాబు మోసం చేసే మనిషని పూర్తిగా అబద్దాలకోరని ఆరోపించారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితిని ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. బాబు పాలనలో డ్వాక్రా రుణాలపై మాటతప్పి నేడు మహిళా లోకానికి మహాశక్తిపై గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో లోకేష్ మంగళగిరి నుండి పోటీ చేస్తున్నారా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు.

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజధాని అమరావతిలో పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను శవాలను పూడ్చుకోవడానికి తప్ప దేనికి పనికిరాదని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం పట్టణంలో వైసిపి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ వైయస్సార్ సర్కిల్ నుండి బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని వైకాపా నాయకులు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, నాయకులు పాల్గొన్నారు. బైక్ ర్యాలీని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ వైయస్సార్ సర్కిల్ నుండి వెంకటేశ్వరస్వామి, పూలంగళ్ల సర్కిల్, బైపాస్ రోడ్డు వరకు కొనసాగింది. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, కొండలరావు, ఖాదర్, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, నాయకులు కోళ్ల భాస్కర్, వీరారెడ్డి, పద్మనాభ రెడ్డి, డానియల్, కృష్ణమూర్తి, సూరి సోపాల వీర, బలిజ సంఘం అధ్యక్షుడు ప్రసాద్, సంపత్, చలపతి, రసూల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందులలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

బస్టాండ్‌లో ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో సోమవారం ప్రజలకు కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ ఉచితంగా పంపిణీ చేశారు. సేవా సంఘం ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ మూడునెలలుగా ప్రజలకు, ప్రయాణికులకు ఎండ నుండి ఉపశమనం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం మజ్జిగను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు నాగేంద్ర యాదవ్, రామకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

సేవారత్న అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని తొమ్మిది సచివాలయాలకు సంబంధించి దాదాపు 200 మంది వాలంటీర్లు తమ విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఐదుగురి సేవలను గుర్తించి ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. సేవారత్న అవార్డులకు రామమునిరెడ్డి, వెంకటలక్ష్మమ్మ, బాబ్జీరెడ్డి, రాజేశ్వరి, దుర్గా తేజస్విని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉత్తమ వాలంటీర్లకు మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, మెడల్, రూ.20వేలు బహుమతిని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వారికి అందజేసి సత్కరించారు. నగదు బ్యాంక్ ఖాతాకు నేరుగా జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఒ గంగిరెడ్డి, మేనేజర్ పుల్లయ్య, కౌన్సిలర్లు ఎరికల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత వాలంటీర్లదే

- ఎంపిపి లక్ష్మీగాయత్రి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సిఎం జగన్‌రెడ్డికి మంచి పేరు తెచ్చే బాధ్యత వాలంటీర్లదేనని ఎంపిపి లక్ష్మీగాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక వృషభాచలేశ్వర స్వామి కళ్యాణమండపంలో వాలంటీర్ల పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు ప్రభుత్వం అందజేసిన నగదు పారితోషికంతో పాటు ప్రశంస పత్రాన్ని చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, ఎంపిటిసి భారతి, కటిక చంద్రశేఖర్, మండల కో-ఆప్షన్ మెంబర్ హసనయ్య, దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రెజ్లర్ల అరెస్టు దారుణం

ప్రజాశక్తి - బద్వేలు

లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ నడిబొడ్డున శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే వారిని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం దారుణమని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ మహిళా కన్వీనర్ సి. గురుదేవి అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ మహిళా కో- కన్వీనర్ టి. నాగేశ్వరి, పట్టణ నాయకులు గంగనపల్లె నాగార్జునతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెజ్లర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని వాపోయారు. ప్రజాస్వామ్యవాదులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులపై అత్యాచారానికి పాల్పడ్డ బిజెపి ఎంపీ బ్రీజ్ భూషణ్ శరన్ సింగ్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలన్నీ కలిసి క్రీడాకారులకు మద్దతుగా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. **కడప :** రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై చర్య తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ యాదవ్, సాయి పాల్గొన్నారు. **కడప అర్బన్ :** న్యాయ పోరాటం చేస్తున్న రెజ్లర్ల అరెస్టు అమానుషమని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మీనాక్షి, అమరావతి, స్వాతి అన్నారు. సోమవారం మహిళా సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీని అరెస్టు చేయకుండా రెజ్లర్లను అడ్డుకోవడం మహిళలను అవమానించడమేనని తెలిపారు. బిజెపి తగిన మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. **జమ్మలమడుగు రూరల్ :** లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోమంటే.. మహిళా రేజ్లర్ల అక్రమ అరెస్టులు చేయడం తగదని డివైఎఫ్ఐ జమ్మలమడుగు నాయకులు ఎల్లయ్య, ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ 30 రోజుల నుండి లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రెజ్లర్ల క్రీడాకారుల అక్రమ అరెస్టులను ఖండి స్తున్నామన్నారు. పార్ల మెంటు ప్రారంభోత్సవం సందర్భంగా రెజ్లర్లు న్యాయం చేయమని కోరుతూ శాంతియుత నిరసన ర్యాలీ చేస్తుంటే, వేధింపులకు పాల్పడిన వారిని వదిలేసి మద్ద తుగా నిలిచిన క్రీడా కారులను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

గాంధీ పార్కులో ప్రవేశం ఉచితం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

సర్వాంగసుందరంగా తయారైన గాంధీపార్కును త్వరలో ప్రారంభించబోతున్నామని, పార్కులోకి ప్రవేశం పూర్తిగా ఉచితమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమా వేశ మందిరంలో సోమ వారం చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ గాంధీ పార్కులోని క్యాంటీన్‌తోపాటు ఓపెన్ ఎయిర్ థియే టర్‌ను విడివిడిగా లీజుకిచ్చినప్పటికీ మహిళలు, వృద్ధులు, పిల్లలు, యువ కులకు పార్కులోనికి ప్రవేశం మాత్రం ఉచితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పాతబస్టాండ్ సమీపంలో త్వరలో రూ. ఏడాదికి రూ.2.50కోట్ల ఖర్చుతో రాజన్న భోజనం ద్వారా పేదలకు ఉచిత భోజనం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రతి రోజు దాదాపు 2000మందికి అన్నం అందించనున్నట్లు తెలిపారు. రాజన్నభోజనం స్థలానికి ఏడాదికి రూ.4లక్షలు మున్సిపాలిటీకి చెల్లిస్తానన్నారు. 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి మాట్లాడుతూ తన వార్డుకు సంబంధించిన కాలువ సమస్య పరిష్కారానికి మూడు నెలల క్రితం మున్సిపల్ కార్యాలయంలో అర్జీ ఇచ్చానని గుర్తు చేశారు. మోడంపల్లి సిసి రోడ్డు అవసరాన్ని గత నెలలో విన్నవించినప్పటికీ అజెండాలో చేర్చకపోవడం శోచనీయమన్నారు. పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చినప్పుడు వాటి పరిష్కారానికి మొదటి ప్రాధాన్య తనివ్వాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్, అధికారులు పాల్గొన్నారు.

'డార్విన్' పాఠ్యాంశంగా కొనసాగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పదవ తరగతి పాఠ్యాంశంగా కొన సాగిం చాలని జెవివి డిమాండ్ చేసింది. అలాగే భారత ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన్ ప్రసార్ అనే సంస్థను మూసివేయకుండా కొనసాగించాలని కూడా డిమాండ్ చేసింది. ఆ చర్యలను ఖండిస్తూ జెవివి ప్రచురించిన కరపత్రాలను స్థానికంగా వేమన విగ్రహం వద్ద సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి కార్యాలయంలో రాష్ట్ర యూత్ నాయకులు మహేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు మాట్లాడుతూ డార్విన్ పాఠాలను తొలగించడం, విజ్ఞాన్‌ప్రసార్‌ను మూసివేయడం వంటి చర్యల ద్వారా సైన్స్‌ను తొక్కివేయడం 21శతాబ్దంలో వీలుకాదన్నారు. అంతిమ విజయం సైన్స్‌దే అన్నారు. కార్యక్రమంలో మహేష్, జెవివి పట్టణ కార్యదర్శి కళ్యాణ్‌కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న్యామతుల్లా, జెవివి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరానికి ప్రవేశాల పక్రియ ప్రారంభమైందని హైస్కూల్ అప్ గ్రేడ్ హెచ్ఎం రమణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం అప్‌గ్రేడ్ చేసినట్లు చెప్పారు. అప్ గ్రేడ్ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి కోర్సులున్నాయన్నారు. జూన్ 1 నుండి కళాశాల ప్రారంభమవుతుందన్నారు. కొత్తగా కళాశాలకు 9 మంది పిజిటిలుగా ప్రమోషన్ మీద వచ్చినట్లు చెప్పారు.

మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

మహానాడులో టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ఉపయో గపడుతుందని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేనిఫెస్టోలోని ప్రతి అంశం చాలా చక్కగా ప్రజలకు ఉపయోగపడేలా ఉందన్నారు. మహానాడు కార్యక్రమం సజావుగా జరగకుండా వైసిపి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేసినా, మహానాడు కార్యక్రమం సూపర్ సక్సెస్ అయ్యిందన్నారు. యువగళం కార్యక్రమాన్ని ఇబ్బంది పెట్టేందుకు ఎమ్మెల్యే రాచమల్లు ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగినరకంగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ అమీర్ పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.96 వేల ఆదాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సోమవారం వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 6వాహనాలను వేలం వేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.96,750 కాగా బహిరంగ వేలంలో వాటి విలువ రూ.1,03,400, జిఎస్‌టి అదనంగా రూ.18,616 ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. కార్యక్రమంలో పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిఐ రామాంజనేయులు, ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు..

వచ్చే ఎన్నికల్లో టిడిపికి మూడు సీట్లే : వైసిపి

ప్రజాశక్తి - కడప

వచ్చే ఎన్నికల్లో టిడిపికి మూడు అంటే మూడు సీట్లే ఖాయమని వైసిపి నాయకులు అన్నారు. జగనన్న ఇచ్చిన సెంటు ఇళ్ల స్థలాలు శవాన్ని పూచే సమాధికి కూడా పనికి రాదని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించడానికి నిరసిస్తూ సోమవారం వైసిపి నాయకులు నగరంలో ర్యాలీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైసిపి కార్యాలయం వద్ద రాష్ట్ర నాయకులు మా సీమ బాబు, అఫ్జల్ ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున, షఫీ, బాలస్వామి రెడ్డి, చల్లా రాజశేఖర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, వీరారెడ్డి, కిరణ్, జమాల్ వల్లి, మోతుకూరు సుబ్బరాయుడు, బండి ప్రసాదు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 7/2023

ఎన్.రాజశేఖర రెడ్డి. ...వాది

Vs

నంది మండలం దాదాపీర్,
వయస్సు సుమారు 63 సం॥లు,
తండ్రి మహబూబ్ సాహెబ్,
ఇంటి నెంబరు 22/401, మున్న ఆజాద్ స్ట్రీట్,
ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా,
మెబైల్ నెంబరు : 9959849438. ...ప్రతివాది

ప్రతివాదికి సమను U/o 5 Rule 3 Of C.P.C

వాది అనేవారు నీపై డిక్రి కొరే నిమిత్తము మీ మీద వ్యాజ్యము వెసినందువలన సదరు వ్యాజ్యమునకు ప్రత్యుత్తరము చెప్పుటకు 15/06/2023 తేదిన పగలు 10.30 గంటలకు స్వతహాగా గాని వకీలు ద్వారా గాని ఈ కోర్టులో హాజరు అయ్యేటట్లు మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదనకు ఆదారముగా మీరు మీ దస్తావేజులను ఆరోజున హాజరు పరుచుటకు మీకు వుత్తర్వులు చేయడమైనది. పైన చెప్పబడిన తేదిన మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమందు వ్యాజ్యమును విమర్శచేసి తీర్మాణించడమవునని మీకు తెలియజేయడమైనది.

(By order of the court)

వాయిదా తేది : 15/06/2023

ఇ. శ్రీనివాస రెడ్డి,
వాది పరం వకీలు,
డోన్ - 518222, నంద్యాల జిల్లా.
సెల్ : 9441579372